సాక్షి జగిత్యాల

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



'గృహలక్ష్మి' కోసం..

కథలాపూర్ : పేదల కోసం చేపట్టిన గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తుదారులు తహసీల్ కార్యాలయాల్లో బారులు తీరుతున్నారు.



స్వచ్ఛతపై ఆరా

సారంగాపూర్/పెగడపల్లి : స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సోమవారం రేచపల్లి, ఏడుమోటలపల్లి గ్రామాల్లో పర్యటించింది.

గరిష్టం/కనిష్టం

32.0/24.0

వాతావరణం

ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా మహారుద్ర పూజలు



పూజలు చేస్తున్న వేదపండితులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహారుద్ర పూజలు ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం చేపట్టారు. వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్, దిలీప్‌శర్మ మంత్రోచ్చారణలతో మూడు రోజులుగా శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమం చేపట్టారు.

గ్రీవెన్స్‌డేతో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలజోన్: పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం చేపట్టే గ్రీవెన్స్‌డే ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. 29 మంది దరఖాస్తుదారులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. బాధితుల సమస్యలపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలతో వెంటనే మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ, గ్రీవెన్స్‌డేలో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతోపాటు, పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యల విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

కవుల సాహితీ స్నేహయాత్ర



యాత్రలో కవులు

జగిత్యాలజోన్: సాహితీ గౌతమి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్నేహ యాత్రలో పలువురు కవులు పాల్గొన్నారు. భాగవతం రచించిన పోతన గ్రామమైన బమ్మెర, సోమన జన్మస్థలమైన పాలకుర్తిని వారు సందర్శించారు. జగిత్యాలకు చెందిన కవులు ఎ.రాజమౌళి, అయిత అనిత, మహేశ్వర్‌శర్మ, లక్ష్మణ్, రంగ శ్రీనివాస్, రవీంద్రనాథ్, సవిత, మంజుల, లక్ష్మి, భాగ్యలక్ష్మి ఇందులో ఉన్నారు.

చేనేత కార్మికులకు అండ



చేనేత కార్మికులను సన్మానిస్తున్న అతిథులు

జగిత్యాల: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం కార్మికులను అన్నివేళలా ఆదుకుంటుందన్నారు. రైతుబీమా తరహాలో నేతన్నలకు కూడా చేనేత బీమా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చయ్య, గంగరాజం, నారాయణ, మల్లయ్య, సత్తయ్య, కోమాకుల లక్ష్మి, గుండేటి లక్ష్మి, స్వప్న, కౌన్సిలర్లు నవీన్, లావణ్య, గంగసాగర్, వొల్లాల గంగాధర్ పాల్గొన్నారు.

డాక్టర్లు సేవ చేయాలి

జగిత్యాల: డాక్టర్లు సమాజానికి సేవ చేయాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రావు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.20 వేల ఉపకారవేతనాలను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఐఎంఏ డాక్టర్ల హక్కులను కాపాడుతూ సమాజ సేవ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల సూపరింటెండెంట్ రాములు, వైస్ ప్రిన్సిపాల్ రఘు, జనరల్ సెక్రటరీలు విజయరావు, జగన్మోహన్‌రావు, ఐఎంఏ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్, కార్యదర్శి అజయ్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పల్లెరోడ్లు



భారీవర్షాలకు తెగిపోయిన మల్లాపూర్ మండలం రాఘవపేట - చిట్టాపూర్ రోడ్డు

- భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో రహదారులు ధ్వంసం
- కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ
- నష్టం అంచనాలు రెడీచేసిన పీఆర్ విభాగం
- మరమ్మతులకు దాదాపు రూ.188 కోట్లు



ధ్వంసమైన చెర్లపల్లి- కిష్టంపేట - రాయికల్ రోడ్డు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. మునుపెన్నడూ లేనిరీతిలో కురిసిన వర్షాలకు చాలాచోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పంచాయతీరాజ్ రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. పెద్దపల్లి జిల్లాలో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈమేరకు పంచాయతీరాజ్ అధికారులు నష్టతీవ్రతను అంచనా వేసేందుకు సబ్ డివిజన్లలో రోడ్ల పరిస్థితిపై సర్వే నిర్వహించారు. జూలై నెలాఖరు నాటికి ఈ రోడ్ల దయనీయ పరిస్థితిపై అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

కరీంనగర్‌లో ఎక్కువ..

కరీంనగర్ రీజియన్‌లో పంచాయతీరాజ్ అధికారులు రోడ్ల నష్టంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. దీని ప్రకారం.. కరీంనగర్‌లో గరిష్టంగా 406.77 కి.మీ. రోడ్లు, జగిత్యాలలో 298.36 కి.మీ., మేర, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 124.43 కి.మీ., పెద్దపల్లి జిల్లాలో కనిష్టంగా 42.46 కి.మీ. మేర రోడ్లు ఉన్నాయి. ఇందులో కరీంనగర్‌లో 163 కి.మీ., జగిత్యాలలో 1.90 కి.మీ. మేర, పెద్దపల్లిలో 0.41 కి.మీ. పాటు, రాజన్న సిరిసిల్లలో 7.43 కి.మీ. మేర దెబ్బతిన్నాయి. ఇందులో కొన్ని రోడ్లు రోడ్ల ఉపరితలం కొట్టుకుపోగా, కొన్నిచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. వీటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అందుకు ఎంతమేరకు ఖర్చవుతుందన్న వివరాలపై అధికారులు తాత్కాలిక నివేదికను రూపొందించారని సమాచారం. దీని ప్రకారం.. జిల్లాలో మొత్తం మీద సుమారు 869 కి.మీలకుగాను 173.70 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి.

రూ.188 కోట్లు కావాలి..



తెగిపోయిన రాయికల్ - కొత్తపేట కల్వర్టు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కరీంనగర్ రీజియన్‌లోని రహదారులకు తక్షణమే మరమ్మతులు అవసరం. వీటి మరమ్మతులకు దాదాపు రూ.188.88 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదిక రూపొందించారు. ఈ ప్రతిపాదనలకు ఇంకా అధికారుల ఆమోద ముద్ర పడాల్సి ఉంది. ఆ తరువాత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే.. టెండర్లు పిలిచి మరమ్మతులు ప్రారంభించనున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాగులు, వంకలు ఆనుకుని ఉన్నగ్రామాల్లో రెండు, మూడురోజులపాటు రాకపోకలు స్తంభించాయి. ఇలాంటి గ్రామాలకు మరమ్మతుల్లో తొలిప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా పల్లెలను, పట్టణాలను కలిపేందుకు కీలకమైన.. బ్రిడ్జిలు చాలాచోట్ల ధ్వంసమయ్యాయి. వీటికి తక్షణమే మరమ్మతులు అవసరం. వీటిని కూడా ప్రాధాన్యం జాబితాలో చేర్చారు.

జిల్లా	మొత్తం రోడ్లు (కి.మీ.)	ధ్వంసమైన కి.మీ.	నిధులు(రూ.లక్షల్లో)
కరీంనగర్	406.77	163.96	7306.70
జగిత్యాల	298.36	1.90	8000.00
పెద్దపల్లి	42.46	0.41	531.50
రాజన్న సిరిసిల్ల	121.43	7.43	3050.35

తెలంగాణ ఉద్యమంలో గద్దర్‌ది కీలకపాత్ర



అంబారిపేటలో నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు



జగిత్యాలలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి
- ప్రజాయుద్ధ నౌకకు ఘన నివాళి

జగిత్యాలటౌన్: తెలంగాణ సాధన ఉద్యమంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ తన ఆట, పాటలతో కీలక పాత్ర పోషించారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి కొనియాడారు. ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై విచారం వ్యక్తం చేశారు. స్థానిక ఇందిరాభవన్‌లో సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, ఎలిగేటి నర్సయ్య, చిట్ల అంజన్న, నేహాల్, గుండ మధు, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

కోరుట్ల: స్థానిక కొత్త బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ, జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, నాయకులు రజియా సుల్తానా, పోషన్న, నాగరాజు పాల్గొన్నారు.



నాచుపెల్లిలో..



కోరుట్లలో..

కథలాపూర్‌లో..

కథలాపూర్(వేములవాడ): అంబారిపేట గ్రామంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో గద్దర్‌కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ వేముల గంగరాజం, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నాచుపెల్లిలో..

కొండగట్టు(చొప్పదండి): నాచుపెల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో గద్దర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. గొప్ప కళాకారుడిని కోల్పోయామని పేర్కొన్నారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాల లక్ష్యాలు పూర్తిచేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



కాన్ఫరెన్స్‌కు హాజరైన అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర

జగిత్యాల: నిర్దేశిత పథకాల లక్ష్యాలను పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తెలంగాణ హరితహారం లక్ష్యాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తిచేయాలన్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతీ జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. గొర్రెల యూనిట్ల లక్ష్యం రెట్టింపు చేశామని, కొనుగోలు వేగవంతం చేసి కాపరులకు అందజేయాలన్నారు. బీసీ కుల వృత్తుల రూ.లక్ష ఆర్థిక సాయం కింద నియోజకవర్గానికి 300 మందికి సాయం అందిస్తామన్నారు. ఇందుకోసం నిధులు విడుదల చేశామని అన్నారు. ఎమ్మెల్యేలు ఆగస్టు 10లోపు చెక్కులు అందజేస్తారని తెలిపారు. మైనార్టీల సంక్షేమం కింద రూ.లక్ష అందిస్తామని చెప్పారు. గృహలక్ష్మి పథకం కింద జిల్లాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రితో లబ్ధిదారుల జాబితా ఆమోదింపజేసుకుని ఆగస్టు 25 నాటికి గృహలక్ష్మి ప్రయోజనాలు మంజూరు చేయాలన్నారు. రెండోదశలో దళితబంధు పథకం అమలు చేయాలని ఆదేశించారు. సోషల్ వెల్ఫేర్ శాఖలో ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కారుణ్య నియామకాల ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేకుంటే లబ్ధిదారుల ఇళ్లు కూల్చివేత ప్రారంభించాలని ఆదేశించారు. మీసేవ ద్వారా నోటరీ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని, దీనిపై పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లత, దివాకర పాల్గొన్నారు.

సమస్యలు వినండి.. పరిష్కరించండి

- అధికారులకు అభాగ్యుల వేడుకోలు
- ప్రజావాణికి పోటెత్తిన బాధితులు

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అభాగ్యులు పోటెత్తారు. విద్య, ఉద్యోగ, వైద్య, పింఛన్, ఫీజురీయింబర్స్‌మెంట్, న్యాయ, భూ సంబంధిత సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. మొత్తం 24 దరఖాస్తులు ఉండగా.. అందులో ధరణి, భూ సంబంధిత సమస్యలు అధికంగా ఉండటం గమనార్హం. అదనపు కలెక్టర్లు లత, దివాకర అర్జీలు స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈసందర్భంగా పలువురు బాధితులు తమ వేదన ఇలా వెల్లడించారు..



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

విలువలు కాపాడండి



రాజీనామా చేసిన జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ భోగ శ్రావణి స్థానంలో మళ్లీ బీసీ మహిళను ఎంపిక చేయాలి. బీసీ మహిళ స్థానంలో ఓసీ పురుష అభ్యర్థిని ప్రస్తుతం ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధం. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి.

– అనుమల్ల కృష్ణహరి, 20వ వార్డు కౌన్సిలర్, జగిత్యాల

చర్యలు తీసుకోండి



జేఎన్టీయూ – కొండగట్టు మధ్య అటవీ ప్రాంతంలో నా కొడుకు రాజేశం ఏప్రిల్ 18న ఉరి వేసుకుని చనిపోయాడు. పోస్టుమార్టం తర్వాత శవాన్ని మాకు అప్పగించారు. నా కొడుకు జేబులో దొరికిన సూసైడ్ నోట్ ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ, నిందితులపై చర్య తీసుకోలేదు. నా కొడుకు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి.

– కోమాకుల దేవమ్మ, కొడిమ్యాల



నిధులు ఇవ్వండి

2021–22, 2022–23 విద్యా సంవత్సరాల ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు ఇంకా విడుదల కాలేదు. ఉన్నత చదువులకు దూరమవుతున్నం. నిధులు రాక మేము, కళాశాల యాజమాన్యాలకు ఇబ్బందులు తప్పడం లేదు. బడ్జెట్‌ను ట్రెజరీకి పంపి టోకెన్ వేసినా ఈ కుబేర్ ద్వారా అకౌంట్లలో డబ్బులు జమ కావడం లేదు.

– డిగ్రీ విద్యార్థులు



క్రమబద్ధీకరించండి

సుమారు 15ఏళ్లుగా మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా పనిచేస్తున్నాం. అయినా, మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంలేదు. తక్షణమే రెగ్యులరైజ్ చేయకుంటే.. ఈనెల 16నుంచి సమ్మె చేస్తాం. – రెండో ఏఎన్‌ఎంలు



భూమిని కాపాడండి

రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించిన సర్వే నంబర్ 51, 52లోని భూమిని కొందరు ఫేక్ డాక్యుమెంట్లతో కబ్జాకు యత్నించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రద్దు చేశారు. అయినా, మరికొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఆస్పత్రి భూమి పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– భూ పరిరక్షణ కమిటీ సభ్యులు, రాయికల్



స్కూటీ ఇప్పించండి

మూడేళ్ల క్రితం జరిగిన యాక్సిడెంట్‌లో ఒక కాలు పోయింది. ఒంటికాలితో నడవలేకపోతున్న. నాకు నాలుగు చక్రాల స్కూటీ ఇప్పించి ఆదుకోండి.

– వస్తం అజయ్, దివ్యాంగుడు, జగిత్యాల



కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు చాలాకాలం తర్వాత ఒకేవేదిక మీదికి వచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో ఐటీ మినిస్టర్ కేటీఆర్‌ను కలిశారు. అభివృద్ధి పనులు, వివిధ అంశాలపై చర్చించారు. చిత్రంలో మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సతీశ్ బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, రమేశ్‌బాబు, దాసరి మనోహర్‌రెడ్డి, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు పాడి కౌశిక్ రెడ్డి, భానుప్రసాద్, రమణ తదితరులు ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

క్లుప్తంగా

తొలిప్రయత్నంలోనే ఎస్సై కొలువు



తల్లిదండ్రులతో శ్రావణి

రాయికల్(జగిత్యాల): ఇటిక్యాల గ్రామానికి చెందిన సామల్ల రమేశ్, రాజగంగుల చిన్నకూతురు శ్రావణి తొలిప్రయత్నంలోనే సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. ఆమె తండ్రి రమేశ్ స్వగ్రామంలో చికెన్ సెంటర్ నడపుతున్నారు. తల్లి బీడీ కార్మికురాలు. శ్రావణి ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు ఇటిక్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివారు. ఐదు నుంచి పదో తరగతి వరకు తాటిపల్లి గురుకులం, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ కోఠీ ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ, కాకతీయ యూనివర్సిటీలో పీజీ స్టాటిస్టిక్స్ చదువుతున్నారు. పీజీ చదువుతున్న సమయంలోనే నోటిఫికేషన్ వెలువడగా, తొలిప్రయత్నంలోనే ప్రిలిమ్స్‌లో ఎంపికయ్యారు. రోజూ 8 గంటల పాటు చదవడంతో ఎస్సై కొలువ సాధ్యమైందని శ్రావణి తెలిపారు. ఆమెను గ్రామస్తులు అభినందించారు.

ఎస్పీని కలిసిన ప్రదీప్‌రావు



ఎస్పీతో ప్రదీప్‌రావు

జగిత్యాల: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ప్రదీప్‌రావు సోమవారం ఎస్పీ భాస్కర్‌ను కలిశారు. ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రదీప్‌రావు.. శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్పత్రి భూమి పరిరక్షించండి



ధర్నా చేస్తున్న నాయకులు

రాయికల్(జగిత్యాల): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి భూమిని పరిరక్షించాలనే డిమాండ్‌తో బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి మాట్లాడుతూ, సర్వే నంబరు 51లోని ప్రభుత్వ భూమిని కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అయితే, అధికారులు ధరణిలో ప్రభుత్వ భూమిగా గుర్తించారని తెలిపారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంబోజి రవి, భూమేశ్, విఠల్, సంజీవ్, మల్లేశ్‌యాదవ్, సతీశ్, సుదర్శన్, శంకర్, ఎల్లాగౌడ్, సుమన్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో బ్యాంకింగ్ సేవలు

- గ్రామాల్లో ఆన్‌లైన్ సేవల విస్తరణకు ప్రభుత్వ నిర్ణయం
- దరఖాస్తు చేసుకుంటున్న డీలర్లు
- ఐబీజీఎఫ్ పరీక్ష అనంతరం ఐడీలు
- పల్లెవాసులకు తప్పనున్న ఇబ్బందులు



రేషన్ డీలర్ వద్ద ఆన్‌లైన్ సేవలు

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రజలకు రేషన్ షాపుల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదివరకు పల్లెవాసులు ఆన్‌లైన్ సేవలు పొందాలంటే మండల, పట్టణ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇందుకోసం వారు నానా ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గ్రామాల్లోని రేషన్ షాపుల్లో బ్యాంకు సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 592 మంది రేషన్ డీలర్లు దరఖాస్తు చేసుకుంటే.. వారిలో కొందరు ఇప్పటికే ఐబీజీఎఫ్ పరీక్ష పూర్తిచేశారు. వీరికి పోస్టల్ అధికారులు ఐడీ నంబర్లు కేటాయిస్తున్నారు. ఇలా జిల్లాలో ఐడీ నంబర్లు ఉన్న 10 మంది రేషన్ డీలర్లు రేషన్‌కార్డుదారులకు బ్యాంక్ సేవలు అందజేస్తున్నారు. పోస్టాఫీసులు లేని గ్రామాల్లో మినీబ్యాంకు తరహాలో ఆన్‌లైన్ సేవలు అందించాలని భావిస్తున్నారు.

రేషన్ డీలర్లకూ లబ్ధి..

- జిల్లాలోని రేషన్ డీలర్లు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు అందిస్తే.. లావాదేవీల ఆధారంగా ప్రభుత్వం వారికి కమీషన్ కూడా అందిస్తోంది.
- రేషన్ షాపుల ద్వారా బ్యాంకులు సేవలు అందిస్తామని దరఖాస్తు చేసుకున్న డీలర్లకు శిక్షణ ఇవ్వడంతోపాటు తపాలా శాఖ ద్వారా ఆన్‌లైన్ పరికరాలు అందిస్తున్నారు.
- కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్ సేవలను అందించే వీలుంది.
- అక్కడ అకౌంట్లలో డబ్బులు వేసుకోవడం, తీసుకోవడంతోపాటు ఇతర బిల్లులను కూడా చెల్లించుకునేందుకు అవకాశం కల్పించారు.
- తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన బాధలు తప్పుతున్నాయి.
- ఈ సేవలు అందించడం ద్వారా ప్రతీసేవకు ప్రజలు కొంత రుసుం చెల్లించాల్సి ఉంటోంది.
- రేషన్ డీలర్లకు ఇలా చెల్లించిన రుసుంతో అదనపు ఆదాయం చేకూరుతోంది.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలో 380 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలోని పోస్టాఫీసులు లేని గ్రామాల్లో రేషన్ షాపుల ద్వారా ఆన్‌లైన్ సేవలు, చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేంద్రాల నిర్వహణకు ఆసక్తి ఉన్న రేషన్ షాపు డీలర్ల నుంచి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలో 10 మంది డీలర్లు ముందుకొచ్చి ఐడీలు తీసుకుని సేవలు అందిస్తున్నారు. మిగతా వారికి ఐబీజీఎఫ్ పరీక్ష అనంతరం శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

పల్లెల్లో బ్యాంక్ సేవలు

గ్రామస్థాయిలో ప్రజలందరికీ బ్యాంక్ సేవలు అందించేందుకు రేషన్ డీలర్లకు ఐబీజీఎఫ్ ఐడీలు జారీచేస్తున్నాం. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రేషన్ డీలర్లకు ఐబీజీఎఫ్ పరీక్ష నిర్వహించాం. ఐడీలు అప్పగించాం. బ్యాంక్ లావాదేవీలు చేయించేలా అనుమతులు జారీచేశాం. ఇంకా దరఖాస్తు చేసుకునే వారికి కూడా అనుమతులు మంజూరు చేస్తాం.

– తుర్తి రాజేశ్, పోస్టల్ సీనియర్ మేనేజర్, జగిత్యాల

బ్యాటరీ ఆధారిత రిక్షాల కోసం శిబిరాలు

- జిల్లా సంక్షేమాధికారి నరేశ్

జగిత్యాల: వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలింకో సంస్థ ద్వారా చేపట్టిన శారీరక దివ్యాంగులకు అవసరమయ్యే బ్యాటరీ ఆధారిత మూడుచక్రాల మోటారు రిక్షాల కోసం జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి పట్టణాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జగిత్యాల పద్మనాయక కల్యాణ మండపంలో పెగడపల్లి, జగిత్యాల మున్సిపాలిటీ, జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, గొల్లపల్లి, మల్యాల, కొడిమ్యాల, సారంగాపూర్ మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 9న కోరుట్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కోరుట్ల అర్బన్, కోరుట్ల రూరల్, మెట్‌పల్లి మున్సిపాలిటీ, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, ఈనెల 10న ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో ధర్మపురి టౌన్, ధర్మపురి మండలం, బుగ్గారం, వెల్గటూర్, ధర్మారం మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. 80 శాతం అంగవైకల్యం కలిగి ఉండాలని, ఆదాయ ధ్రువీకరణ పత్రం, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని శిబిరాలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

రుణమాఫీపై సందిగ్ధం

విధి విధానాలు ప్రకటించని ప్రభుత్వం



మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు బ్యాంకుల నుంచి పంట రుణం తీసుకుంటున్నారు. ఇలా తీసుకున్న రూ.లక్ష లోపు పంట రుణాన్ని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుందని 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. ఆ తర్వాత దాటవేసే ధోరణి ప్రదర్శిస్తూ వచ్చింది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో 2018లో రూ.లక్షలోపు తీసుకున్న పంట రుణం మాఫీ చేస్తామని ప్రకటించింది. దీనిపై ఇంకా విధివిధానాలు ఖరారు కాలేదు. దీంతో రుణమాఫీ ఎవరికి వర్తిస్తుంది, ఎవరికి వర్తించదని రైతుల్లో సందిగ్ధం నెలకొంది.

సీజన్‌కు రూ.900కోట్ల పంట రుణాలు..

- జిల్లాలో ప్రతీసీజన్‌లో రూ.900 కోట్ల వరకు బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందిస్తున్నాయి.
- అందులో రూ.400 కోట్ల వరకు రూ.లక్షలోపు ఉంటాయని బ్యాంకర్లు చెబుతున్నారు.
- రైతుల వ్యవసాయ భూమిని బట్టి బ్యాంకులు పంటరుణాన్ని మంజూరు చేస్తున్నాయి.
- ఈ మేరకు 1,12,069 మంది రైతులు 2018 డిసెంబర్ వరకు రూ.లక్షలోపు పంటరుణం తీసుకున్నారని గణాంకాలు ఉన్నాయి.
- వీటిలో తొలుత రూ.25వేల లోపు రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.
- అందులో 7,730 మంది రైతులకు రూ.11.70 కోట్లు మాఫీ అయ్యాయి.
- ఆ తర్వాత రూ.50 వేలలోపు మాఫీ చేయగా, 7,785 మందికి రూ.26.39 కోట్లు లబ్ధి చేకూరింది.
- ఇంకా 96,454 మంది రైతులకు దాదాపు రూ.260 కోట్ల వరకు మాఫీ కావాల్సి ఉంది.

రుణమాఫీ లేక..

పంటరుణం మాఫీ చేస్తామన్న ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రైతులు వడ్డీలపై వడ్డీలు చెల్లిస్తూ వస్తున్నారు. వడ్డీ చెల్లిస్తేనే పంట రుణం రెన్యూవల్ చేస్తామని బ్యాంకర్లు ప్రకటించడంతో కొందరు రైతులు వడ్డీలు చెల్లించారు. మరికొందరు ప్రభుత్వ ప్రకటన కోసం చూస్తున్నారు. దీంతో వడ్డీలు మోయలేని భారంగా మారాయి. రూ.లక్ష లోపు రుణానికి ఏడాదికి రూ.7 వేల – రూ.8వేల వరకు బ్యాంకర్లు వడ్డీలు వసూలు చేశారు. నాలుగేళ్ల నుంచి రూ.లక్షకు వడ్డీ, దానిపై మళ్లీ వడ్డీ.. ఇలా చెబుతూ పోతే. అసలు మొత్తం కన్నా వడ్డీ అధికం అయి ఉంటుందని రైతులు అంటున్నారు.

ఇంకా రాని స్పష్టత..

- రుణమాఫీపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు.
- దీంతో ఎవరికి రుణం మాఫీ అవుతుంది, ఎవరికి కాదనే సందిగ్ధం రైతుల్లో నెలకొంది.
- ప్రధానంగా భార్యాభర్తలిద్దరూ రుణం తీసుకుంటే ఇద్దరికీ వర్తిస్తుందా?
- తండ్రి, తల్లి, కుమారుడు, కూతురు రుణం తీసుకుంటే పరిస్థితి ఏమిటి? బంగారంపై పంట రుణం పరిస్థితి ఏమిటి?, రూ.లక్ష రుణం తీసుకున్నా.. దానిని రెన్యూవల్ చేయలేదని, దానిపై వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- కొందరు రూ.50 వేలు రుణం తీసుకుంటే, వడ్డీతో కలిపి రూ.లక్ష అయితే అది రుణమాఫీ కిందకు వస్తుందా?
- ఏటా వడ్డీ చెల్లిస్తూ రెన్యువల్ చేసుకుంటూ వస్తే మాఫీ వర్తిస్తుందా?
- ఇవన్నీ రైతుల మదిని తొలుస్తున్నాయి.

వడ్డీ మాఫీ చేయాలి



నాకు ఎనిమిది ఎకరాలు ఉంది. లక్ష రూపాయల పంట రుణం తీసుకున్న. వడ్డీ కట్టకుంటే రెన్యువల్ చేయలేమని బ్యాంకర్లు చెప్పిండ్రు. ప్రభుత్వం రుణం మాఫీ చేస్తుందా? లేదా? అనే అనుమానంతో నాలుగేళ్లుగా వడ్డీ కడుతూనే వచ్చిన. వడ్డీ మాఫీ చేయాలి.

– వామన్, రైతు, అంతర్గాం

వివరాలు పంపించాం



జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రూ.లక్ష లోపు పంట రుణాల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై కచ్చితంగా వడ్డీ వసూలు చేస్తారు. ఏటా వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకున్నవారికి ఇబ్బంది ఉండదు.

– వెంకట్‌రెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్

నిబంధనల మేరకు మాఫీ



నిబంధనల ప్రకారం రుణమాఫీ ఉంటుంది. రైతులు ఆందోళన చెందవద్దు. ఇప్పటికే రూ.25 వేలలోపు పంటరుణం తీసుకున్న దాదాపు 15 వేల మంది రైతులకు మాఫీ అయ్యింది. ప్రభుత్వ ప్రకటనతో మిగతా రైతుల రుణాలు కూడా మాఫీ అవుతాయి.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

మత మార్పిడి చేయిస్తున్నారని ఫిర్యాదు



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ధర్మపురి: రామయ్యపల్లె గ్రామంలో కొందరు బలవంతంగా మత మార్పిడికి పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పలువురు గ్రామస్తులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. రామయ్యపల్లెలోని ఐదో వార్డులో ఇటీవల అనుమతి లేకుండా ఓ ప్రార్థన మందిరం ఏర్పాటు చేశారని, అందులోని కార్యకలాపాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వార్డుకు చెందిన సుమారు 20మంది సంతకాలతో వినతిపత్రం అందజేశారు. ధర్మపురికి చెందిన హిందూ ఐక్యవేదిక సభ్యులు వారికి మద్దతు తెలిపారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పంజాల సంతోష్, గంగాధర్, బూరుగు శ్రీనివాస్, రాఘవరెడ్డి, సుమన్, తిరుపతి, హిందూ ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



ఆరోగ్య దీపిక పుస్తకాలతో విద్యార్థులు

మల్లాపూర్(కోరుట్ల): విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఆయుర్వేద వైద్యాధికారి కృష్ణవేణి సూచించారు. రేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆయుష్ ఆరోగ్య దీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.గణేందర్, ఫార్మసిస్ట్ జలేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్లపై కేసు

జగిత్యాల: జిల్లాలోని ధర్మపురికి చెందిన గల్ఫ్ ఏజెంట్లు రాచకొండ రమేశ్, రౌతు వాసుపై కేసు నమోదు చేసినట్లు సీఐ నటేశ్ సోమవారం రాత్రి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన మెరుగు సునీల్‌ను యూరప్ పంపిస్తానని చెప్పి రూ.3లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేసిన గల్ఫ్ ఏజెంట్లు.. ఎంతకీ యూరప్ పంపించలేదు. విసిగి వేసారిన బాధితుడు సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శితో సమావేశం



నవీన్ మిట్టల్‌తో మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్‌తో జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. జిల్లా అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించారు.

బాలుడి మృతి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని పేరపల్లికి చెందిన ఓ బాలుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. బాలుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లిదండ్రులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలోనే చనిపోయాడు. బాలుడికి మృతికి సదరు వైద్యుడే కారణమంటూ బంధువులు ఆందోళనకు సిద్ధమయ్యారని సమాచారం. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం రామయ్యపల్లి గ్రామానికి చెందిన కొంతం రఘు(32) వ్యక్తిగత కారణాలతో ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తుల వివరాలు.. రఘు గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. కొద్ది రోజుల నుంచి కుటుంబంలో గొడవలు జరుతుండగా పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. ఇదే క్రమంలో రఘు పొలం వద్ద పురుగుల మందు తాగడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

పెద్దపల్లిరూరల్: విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి పీఆర్ఎల్, జిల్లా సెషన్స్ జడ్జి హేమంత్‌కుమార్ రూ.9,842 జరిమానా విధించారు. వివరాలిలా ఉన్నాయి. సుల్తానాబాద్ మండలం సుభాష్‌నగర్‌కు చెందిన న్యాతరి శంకర్ 2016వ సంవత్సరంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా నేరం అంగీకరించడంతో మొదటిసారి రూ.వెయ్యి జరిమాన విధించారు. 2017లో సైతం మళ్లీ విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడటంతో విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. నిందితుడు నేరం ఒప్పుకోవడంతో రూ.9,842 జరిమానా లేదా మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ విజిలెన్స్ కె.స్వామి, విజిలెన్స్ ఎస్సై నరేశ్, సిబ్బంది తెలిపారు.

నిధులు కేటాయించాలని వినతి

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కొడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు కోరారు. ఈమేరకు సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాలయంలో టీటీడీ బోర్డు సభ్యుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుకు ఒక వినతిపత్రం అందజేసినట్లు వారు వివరించారు.

నియామకం



నరేశ్

జగిత్యాల: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సాంస్కృతిక ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొమ్మడి నరేశ్ నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ సోమవారం నరేశ్‌కు ఉత్తర్వులు అందజేశారు.

కొడిమ్యాలలో..

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాలకు చెందిన చిట్యాలపల్లి సాయి, కోనాపూర్ గ్రామానికి చెందిన తోకల శ్రావణ్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. ఈమేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం

జగిత్యాల: ఉద్యోగులకు అండగా ఉంటామని టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోగ శశిధర్, నాగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పలు ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో కొన్నిసంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేశారన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవో ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఫోరం అధ్యక్షుడు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



మల్లేశం

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేశం(28) అదృశ్యమైనట్లు పోలీసులు సోమవారం తెలిపారు. మల్లేశం ఈనెల 6న ఉదయం తన స్నేహితుడి బైక్‌ను తీసుకొని బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకూ ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు.. తమ బంధువులను ఫోన్‌లో వాకాబు చేశారు. అయినా, ఆచూకీ లభించలేదు. అయితే, మల్లేశంకు పెళ్లి జరిగినా భార్య కాపురానికి రావడంలేదని, మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మల్లేశం తల్లి మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

అసెంబ్లీలో మన్నెగూడెం మండలం ప్రస్తావన

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలనే అంశాన్ని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అసెంబ్లీలో ప్రస్తావించడంపై సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మన్నెగూడెం గ్రామపంచాయతీ వద్ద ప్రజలు సమావేశమయ్యారు. మన్నెగూడేన్ని మండలంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆశవర్కర్ మృతి

- మొర్రాపూర్ తండాలో విషాదం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మొర్రాపూర్ తండాకు చెందిన ఆశవర్కర్ దండు పద్మ(40) గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పద్మ రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురికాగా కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్సలో భాగంగా స్టంట్ వేయగా.. మరోసారి గుండెపోటుకు గురైంది. వైద్యులు ఆమెను రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. ఆపరేషన్ జరిగిన గంటల వ్యవధిలోనే పద్మ మృతి చెందింది. పద్మ మృతదేహన్ని స్వగ్రామం మొర్రాపూర్‌కు తరలించారు. పద్దెనిమిదేళ్లుగా ఆశవర్కర్‌గా పనిచేస్తున్న పద్మ.. తండాలో ఎంతో మందికి నాణ్యమైన వైద్యం అందించేందుకు పనిచేసిందని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. భర్త నర్సింలు కూలీ పనులు చేస్తుండగా వీరికి పల్లవి, చిరంజీవి, వంశీ సంతానం.

పని ఒత్తిడితోనే పద్మ మృతి..

ఆశవర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, సీఐటీయూ నాయకుడు రమేశ్ మాట్లాడుతూ వేతనాలు లేకుండా, పనిభారంతోనే పద్మ గుండె జబ్బుకు గురైందని ఆరోపించారు. అధికారులు విధిస్తున్న పనులతో ఆశవర్కర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎంతో మంది ఆశ వర్కర్లు పనిభారం భరించలేక గుండె ఆగి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. – మంజుల, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి

స్వగ్రామానికి గల్ఫ్ మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన వలసజీవి మృతదేహం స్వగ్రామం చేరింది. నిజామాబాద్ గ్రామానికి చెందిన జక్కుల లచ్చవ్వ–భూమయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు లక్ష్మణ్(40) పదేళ్లుగా దుబాయ్ వెళ్తున్నాడు. మూడేళ్ల క్రితం ఇంటికి వచ్చి అప్పు చేసి ఇల్లు కట్టాడు. మళ్లీ దుబాయికి వెళ్లి ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తక్కువ వేతనం రావడంతో అప్పులెట్లా తీర్చాలన్న బెంగతో జూలై 31న తన రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మిత్రుల సహకారంతో ఆదివారం రాత్రి గల్ఫ్ నుంచి శవపేటిక ఇంటికి చేరింది.